సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



మెడికోలను బలిగొన్న అతివేగం!

అతివేగం.. అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రిమ్స్ వైద్య విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. 10లో▶



రాష్ట్రపతిని కలిసిన ఎమ్మెల్యే పాయల్

ఆదిలాబాద్: హైదరాబాద్‌కు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం కలిశారు. సాదర స్వాగతం పలికారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
24.0 /12.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేకువజామున చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

ఆదిలాబాద్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాస్థాయి పోలీసు క్రీడా పోటీలను ఎస్పీ సోమవారం ప్రారంభించారు. ఆదిలాబాద్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, ఆదిలాబాద్ సబ్ డివిజన్, ఉట్నూర్ సబ్ డివిజన్, ఆదిలాబాద్ హోంగార్డ్ టీం విభాగాలు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ (సింగిల్, డబుల్), అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ, డీసీఆర్బీ సీహెచ్. శ్రీనివాస్, సీఐలు ఏ.అశోక్, నరేష్ కుమార్, భీమేష్, రిజర్వ్ సీఐలు టీ.మురళి, స్వామి, నవీన్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రిజర్వ్ సిబ్బంది, సబ్‌డివిజనల్ సిబ్బందిపాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

నేరడిగొండ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సోమవారం సందర్శించారు. ఇటీవల ఆ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడి వెకిలిచేష్టల కారణంగా విద్యార్థినులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. స్పందించిన డీఈవో పాఠశాల హెచ్‌ఎం పద్మ, ఎంఈవో భూమారెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ విజయ్‌తో పాటు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని వారు డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఆమె ఇతర పాఠశాలకు పంపిద్దామని అనడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఆ సారు వద్దే వద్దంటూ నినదించడంతో ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు విద్యార్థులు, వారి పోషకులకు డీఈవో తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు గ్రూపులుగా కాకుండా సమన్వయంతో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు.

డీఈడ్ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

కైలాస్‌నగర్: 2023–25 బ్యాచ్‌కు సంబంధించి రెండు సంవత్సరాల డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల కోసం డీఈఈ సెట్–2023 రాసిన అభ్యర్థులకు ఫేజ్–1 ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేసినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 20నుంచి షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 20న సర్టిఫికెట్ల పరిశీలన, 22 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో కళాశాలలనమోదు, 30న కళాశాలల కేటాయింపు, వచ్చేఏడాది జనవరి 1 నుంచి 3 వరకు ఫీజు చెల్లింపు, కళా శాలలో ప్రవేశం, సీటు లభించిన వారు 5న కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. 8వ తేది నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

లోక్‌సభపై హస్తం గురి



ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క



పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు

- రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల నియామకం
- మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు బాధ్యతలు
- ఆదిలాబాద్‌లో ఆమెకు సవాలే
- పెద్దపల్లిలో 'దుద్దిళ్ల'కు సులువేనా..

సాక్షి, ఆదిలాబాద్: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ గురి పెట్టింది. జనవరిలో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు పరిధిలో పార్టీని పటిష్టం చేయడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఆదిలాబాద్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను, పెద్దపల్లికి ఐటీ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును నియమించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగింటిలో బీజేపీ గెలిచింది. రెండు చోట్ల బీఆర్‌ఎస్, ఒకచోట కాంగ్రెస్ విజయం సాధించాయి. ఇక పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్నీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించడం శ్రీధర్‌బాబు పెద్దకష్టం కాదని ప్రచారం సాగుతోంది.

సీతక్కకు సవాలే..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమితులైన సీతక్కకు ఇక్కడ సవాళ్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ విజయ ఢంకా మోగించింది. ఎంపీగా సోయం బాపూరావు విజయం సాధించారు. గడిచిన శాసన సభ ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు కమలం ఖాతాలో చేరాయి. బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ తమ ప్రాబల్యం నిలుపుకుంది. కేవలం ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ఇదిలా ఉంటే గతంలో సీతక్క ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పలుమార్లు పర్యటించారు. నాయకులు, పార్టీ స్థితిగతులపై అవగాహన ఉంది. అయితే ప్రతికూల పరిస్థితుల నుంచి విజయాన్ని అందుకోవాల్సిన పరిస్థితుల నేపథ్యంలో లోక్‌సభ సీటును గెలిపించడం సీతక్కకు సవాలే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీధర్‌బాబుకు సులువేనా..

ఇక పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమితులైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇదే నియోజకవర్గ పరిధిలోని మంథని శాసనసభ్యుడు. గతంలో కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. స్థానిక నేతలపై పట్టు ఉంది. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ బీఆర్‌ఎస్ హవాతో అభ్యర్థి బొర్లకుంట వెంకటేశ్‌నేత ఎంపీగా గెలిచారు. ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. చెన్నూర్, మంచిర్యాల, మంథని, రామగుండం, పెద్దపల్లి, ధర్మపురిలో హస్తం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక ఆరు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ రెండో స్థానంలో, మంచిర్యాల నియోజకవర్గంలో మూడో స్థానంలో నిలవడం గమనార్హం. దీంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ ఉత్సాహం చూపుతుండగా, బీఆర్‌ఎస్ 2019 ఫలితాలను పునరావృతం చేయాలని చూస్తోంది. అయితే ఇక్కడ పార్టీని గెలిపించడం శ్రీధర్‌బాబుకు సులువే అన్న చర్చ సాగుతోంది.

ఈ బాధ్యత ఇన్‌చార్జీలదే..

ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యతలను కూడా ఇన్‌చార్జీలే తీసుకోనున్నారు. అయితే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆరుచోట్ల ఎమ్మెల్యేలు లేకపోవడంతో అక్కడ ఆ పథకాల అమలు పరంగా ఆ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారిని పరిగణలోకి తీసుకుని ముందుకెళ్తారా.. లేక ఇతర ముఖ్య నాయకులకు ప్రాధాన్యతనిస్తారనేది చూడాలి. ఇక పెద్దపల్లిలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో సంక్షేమ పథకాల అమలులో ఆ పార్టీకి పెద్దగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేదు. డిసెంబర్ 28 నుంచి గ్రామసభలు నిర్వహించి పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక చేయనున్నారు. ఈ క్రమంలో ఇన్‌చార్జీలు కీలకం కానున్నారు.

ఆదివాసీల ఆందోళన

- కలెక్టరేట్ ముట్టడి
- ఇంటి పట్టాలు జారీ చేయాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

కైలాస్‌నగర్: మావల మండలంలోని కుమురంభీంగూడకు చెందిన ఆదివాసీలు సోమవారం ఆందోళన చేపట్టారు. తమకు పట్టాలివ్వడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. ప్రధానగేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ వారి వద్దకు వచ్చారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ మాట్లాడుతూ.. మావల మండలం బట్టిసావర్గం శివారు సర్వేనంబర్ 72/23 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ఆదివాసీలకు వెంటనే ఇంటిపట్టాలు జారీ చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. సర్వేనం.72లో 460 ఎకరాలు ఉండేదని, 1954లో వ్యవసాయం కోసం కొందరికి లావాణి పట్టాలు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. పట్టాదారులు అక్కడ లేకపోవడంతో 1960లో వాటిని స్వాధీనం చేసుకుందన్నారు. కానీ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దొంగ పట్టాలు సృష్టించి ఆ భూమిని తమ పేరిట మార్చుకున్నారన్నారని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఆందోళన నేపథ్యంలో పోలీసులు కలెక్టరేట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వయంగా ఏఎస్పీ సమయ్‌జాన్ రావు భద్రతను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు..

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- పలు శాఖల అధికారులపై ఆగ్రహం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ పలు శాఖల అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం శాఖలవారీగా పెండింగ్ అర్జీలపై సమీక్షించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో 13, పంచాయతీశాఖలో 10, మైనార్టీశాఖలో 12 అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన ఆయన వారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీడీఏలో అత్యధికంగా అర్జీలు పెరగడంపై ఏటీడబ్ల్యూవోను ప్రశ్నించిన కలెక్టర్ తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే వారం వరకు ప్రతి శాఖలో ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, జెడ్పీ సీఈఓ గణపతి, డీఆర్డీవో కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదిన..

పింఛన్ రావట్లేదు



నేను నిరుపేదను. ఇన్‌ఫెక్షన్ కారణంగా మూడేండ్ల క్రితం నా రెండు కాళ్లు తొలగించిండ్రు. నడువలేని పరిస్థితి. నా భార్య కూలీ పని చేస్తే తప్ప పూటగడవదు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏడాదైతంది. ఇప్పటి వరకు మంజూరు కాలే. అధికారులను ఎన్నిసార్లు కలిసినా ఆన్‌లైన్‌లో ఉందని చెబుతున్నరు. త్వరగా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలె.

– కేంద్రే విఠల్, బంగారుగూడ

అక్రమంగా కేసు పెట్టారు



ఎలాంటి దేశీదారు విక్రయించనప్పటికీ ఎక్సైజ్ అధికారులు నాపై ఉద్దేశపూర్వకంగా అక్రమంగా కేసు పెట్టారు. గతంలో మద్యం అమ్మేవాడిని. ప్రస్తుతం ఎలాంటి మద్యం విక్రయాలు చేపట్టకున్నా బెల్టు షాపు నిర్వాకులతో సన్నిహితంగా వ్యవహరిస్తున్న ఓ ఎక్సైజ్ అధికారి నాపై కక్షపూరితంగా కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలి.

– సచిన్ జైస్వాల్, గోముత్రి, భీంపూర్

పత్రాలు ఇప్పించండి



మేము ఆదిమ గిరిజన తెగకు చెందిన కొలాం గిరిజనులం. పదేండ్ల క్రితం వచ్చిన భారీ వరదలకు పెన్‌గంగ ఉప్పొంగడంతో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వంటివన్నీ కొట్టుకుపోయాయి. వాటి కోసం అప్పటి నుంచి సార్ల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పదేండ్ల సంది మాకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. పెద్ద సార్లు మాపై దయ చూపాలని కోరుతున్నం.

– టేకం సంగీత–జాడు దౌన, బేల

ఇండ్ల స్థలాలు కేటాయించాలి




మేమంతా ఎస్సీ కులానికి చెందిన నిరుపేదలం. సొంత ఇండ్లు లేక ఏండ్ల కొద్ది కిరాయి ఇండ్లలో ఉంటూ కాలం వెల్లదీస్తున్నం. కూలీనాలీ చేసుకుని బతికే మాకు కిరాయి కట్టుడు భారమైతంది. ఇంటి స్థలాల కోసం ఐదేండ్లుగా అధికారులు, నాయకులకు విన్నవిస్తూనే ఉన్నాం. ఎవరూ కనికరించట్లేదు. ఇప్పటికైనా స్పందించి మాకు ఇండ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నం.

– మనీషా, లలిత, సుభాష్‌నగర్

ఔను.. కలెక్టర్‌కు కోపమొచ్చింది!

కైలాస్‌నగర్: కలెక్టర్‌కు కోపమొచ్చింది.. ఎప్పుడు శాంతంగా, సరదాగా కన్పించే రాహుల్‌రాజ్ తొలిసారిగా ఆగ్రహం వ్యక్తం చేయడం అధికారులను విస్మయానికి గురిచేసింది. ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచిన అధికారులను తీవ్రంగా మందలించిన కలెక్టర్, పది, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. తన అనుమతి లేకుండా అధికారులెవరూ సెలవులో వెళ్లవద్దని ఆదేశించిన కలెక్టర్ ప్రజావాణిని లైట్‌గా తీసుకుంటే సహించబోనని కాస్త గట్టిగానే హెచ్చరికలు జారీ చేశారు. అర్జీదారులు వచ్చిన రాకపోయినా ప్రతి జిల్లా స్థాయి అధికారి ఉదయం 10.30 గంటలకు సోమవారం జరిగే ప్రజావాణికి విధిగా రావాలని లేకుంటే కుదరని తెల్చిచెప్పారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో సీఎం సమీక్ష ఉన్నందున జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సంక్షిప్త సమాచారంతో మంగళవారం సాయంత్రంలోగా అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హాజరు శాతం పెంచడంతో పాటు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం గుండె పోటుతో మరణించిన భీంపూర్ తహసీల్దార్ నారాయణ మృతికి సంతాప సూచకంగా అధికారులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..



ఫోన్‌లో సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- 'ఆదిలాబాద్'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..
- మున్సిపల్ పరిధిలో ప్రతీ వార్డులో పర్యటిస్తా
- సాక్షి 'ఫోన్ ఇన్'లో ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి ఫోన్ ఇన్

కైలాస్‌నగర్/ఆదిలాబాద్: 'నన్ను ఆదరించి గెలిపించిన ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తా. ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన కార్యాచరణపై త్వరలోనే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తా. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో స్వయంగా పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటా. ఎమ్మెల్యే నిధులతో పాటు అవసరమైతే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యేతో సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది ఫోన్ చేసి సమస్యలను ఎమ్మెల్యేకు నివేదించారు. వాటిని ఓపిగ్గా ఆలకించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు.

ప్రశ్న: మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, ఎన్టీఆర్ చౌక్ ప్రాంతాల్లో తోపుడు బండ్లు రోడ్డుకు దగ్గరగా ఉంచడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి..? (చంద్రశేఖర్, రిటైర్డ్ టీచర్, న్యూహౌసింగ్ బోర్డు)

ఎమ్మెల్యే: పట్టణంలో ఈ సమస్య ఉన్నది వాస్తవమే. గత పాలకుల హయాంలో రోడ్లు ఇరుకుగా నిర్మించారు. దీంతో చిరు వ్యాపారులు తోపుడు బండ్లను రోడ్లపైకి తీసుకొచ్చి విక్రయాలు జరిపిస్తున్నారు. సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతాను.

ప్రశ్న: తిర్పెల్లి కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో పాటు గుంతలు ఉన్నాయి. దీంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. (కళ్యాణ్, శ్రీరాం కాలనీ)

ఎమ్మెల్యే: మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కరించేలా చూస్తాను.

ప్రశ్న: టాక్లీ నుంచి బేల వరకు గల రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. మహారాష్ట్రకు చెందిన లంబాడాలు బేలలోని పలు గ్రామాలకు వలసవచ్చి రెవెన్యూ అధికారులకు ముడుపులిచ్చి అడ్డదారిన ఎస్టీ ధ్రువీకరణ పత్రం పొందుతూ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారు.. (సంతోష్, టాక్లీ)

ఎమ్మెల్యే: ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులతో త్వరలోనే సమీక్ష నిర్వహించి వాటి పరిస్థితులను తెలుసుకుంటాను. అలాగే నకిలీ ధ్రువీకరణ పత్రాలను జారీచేయకుండా రెవెన్యూ అధికారులను ఆదేశిస్తా.

ప్రశ్న: నాకు నిజామాబాద్ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో బ్రెయిన్ సర్జరీ జరిగింది. రూ.10లక్షలు ఖర్చైంది. ఉన్న ప్లాటు అమ్మేశాను. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది గడిచినా సాయం అందలేదు. (సాయికుమార్, హౌసింగ్‌బోర్డు)

ఎమ్మెల్యే: కొత్త ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేశాక వాటి ప్రకారం ఆర్థిక సాయమందించేందుకు తప్పకుండా కృషి చేస్తాను.

ప్రశ్న: రాత్రి సమయంలో వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి వెళితే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లమని అక్కడి వైద్యులు సూచిస్తున్నారు. (హిదాయత్ పఠాన్, బొక్కల్‌గూడ)

ఎమ్మెల్యే: రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి, రాత్రి డ్యూటీలో డాక్టరేవరున్నారో, అక్కడి సమస్యలేంటో తెలుసుకుని ఇంకోసారి జరుగకుండా తగు చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న: ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ పంచాయతీ పరిధిలో కొత్తగా ఏర్పడిన చిన్న మారుతిగూడలో తాగునీరు, రోడ్లు, కరెంట్ వంటి వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. సౌకర్యాలు కల్పించేలా చూడాలి.(గణపతి, సురేష్, సిడాం మారుతీ, చిన్నమారుతీగూడ, అంకాపూర్)

ఎమ్మెల్యే: త్వరలోనే మండల అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శిస్తాను. అక్కడి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సాధ్యమైనంతవరకు కృషి చేస్తాను. ఇప్పటికే పాయల్ ఫౌండేషన్ ద్వారా బోరు వేయించాము.

ప్రశ్న: మాకు ప్రభుత్వమిచ్చిన ప్లాట్లలో సీపీఐ నాయకులు గుడిసెలు వేయించారు. వాటిని తొలగించాలని కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. (గాలిపెల్లి నాగన్న, మావల)

ఎమ్మెల్యే: మున్సిపల్ అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకునేలా చూస్తాను. ఈ నెల చివరిలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

ప్రశ్న: ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ మా పల్లెకు బస్సులు రావడం లేదు..? (సురేష్, అంకాపూర్ జీపీ)

ఎమ్మెల్యే: ఈ విషయమై ఆర్టీసీ అధికారులతో త్వరలోనే సమీక్ష నిర్వహిస్తాం. రహదారి సౌకర్యం ఉండి ఆర్టీసీ సదుపాయం లేని గ్రామాలకు బస్సులు నడిపించేలా చర్యలు చేపడతాం. అన్ని గ్రామాలకు బస్సులు వచ్చేలా చూస్తాను.

ప్రశ్న: టీచర్స్ కాలనీలోని అడాణేశ్వర్ మందిర్ ప్రాంతంలో రహదారి, నీటి సమస్య తీవ్రంగా ఉంది..? (మధుకర్, టీచర్స్‌కాలనీ)

ఎమ్మెల్యే: మీ కాలనీ సమస్యలు ఇదివరకే నా దృష్టికి వచ్చాయి. ఇటీవలే మున్సిపల్ అధికారులతో మాట్లాడాను. రోడ్ల నిర్మాణంతోపాటు నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపడతాం.

ప్రశ్న: పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. దీంతో పాదాచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను పరిష్కరించాలి.. (కేతిరెడ్డి గంగారెడ్డి, కైలాస్‌నగర్)

ఎమ్మెల్యే: ఈ విషయమై పోలీసు, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం. వారం పది రోజుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఆక్రమణల విషయమై, వీధి వ్యాపారుల సముదాయం గురించి కూడా రివ్యూచేస్తాం.

ప్రశ్న: మా కాలనీలో సమస్యలు ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. రహదారి సమస్యతో సతమతం అవుతున్నాం... (రాంరెడ్డి, టీచర్స్ కాలనీ)

ఎమ్మెల్యే: త్వరలోనే వార్డును విజిట్ చేసి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తా.

ప్రశ్న: మా కాలనీతో పాటు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో జనం రోగాల బారిన పడుతున్నారు..?(శ్రీనివాస్, శాంతినగర్)

ఎమ్మెల్యే: పట్టణంలోని శాంతినగర్‌తో పాటు అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులను ఆదేశిస్తాం. అదనపు సిబ్బందిని సైతం నియమించైనా సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: కాలనీకి సంబంధించిన మురుగు నీరంతా నా ఇంటి ముందు వచ్చి చేరుతోంది. వాసన భరించలేకపోతున్నాం. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..(కార్తికేయ, కేఆర్‌కే కాలనీ)

ఎమ్మెల్యే: మున్సిపల్ అధికారులతో మాట్లాడతాం. కేఆర్‌కే కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఏ సమస్యలు తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ప్రశ్న: కాలనీలో ఎవరైన మరణించినప్పుడు అంతిమ యాత్ర కోసం అవస్థలు ఎదురవుతున్నాయి. శ్మశానవాటిక లేకపోవడంతో రోడ్డు పక్కన దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది..?(దోని జ్యోతి, శ్రీరాంకాలనీ)

ఎమ్మెల్యే: కాలనీలో శ్మశానవాటిక ఏర్పాటు కోసం అధికారులతో మాట్లాడతాం. దీనికి సంబంధించి స్థల సేకరణ చేపట్టి నిర్మాణం కోసం కృషి చేస్తా.

ప్రశ్న: మా గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో చాలా ఇబ్బందవుతుంది. కొత్త రోడ్డు నిర్మించాలి (రవీందర్, చిచ్‌దరి ఖానాపూర్)

ఎమ్మెల్యే: సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా. త్వరలోనే రోడ్డును కూడా పరిశీలిస్తా.

క్లుప్తంగా

సత్తాచాటిన వికలాంగ విద్యార్థులు



సత్తాచాటిన విద్యార్థులతో అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మైదానంలో జరిగిన ఆటల పోటీల్లో ఉట్నూర్‌లోని వికాసం ప్రత్యేక బాలల బడి పిల్లలు పాల్గొని తమ సత్తా చాటారు. ఏ విషయంలోనూ తాము తక్కువ కాదని నిరూపించారు. రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారం, జావిలింగ్‌త్రో పోటీల్లో వికాసం పాఠశాల నుంచి అంధులు, మానసిక వికలాంగ విద్యార్థులు పోటీల్లో పాల్గొని 18 బహుమతులు గెలుపొందారు. వికాసం విద్యార్థుల ప్రతిభను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయ్, డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతి, ప్రిన్సిపాల్ వికాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మామడ: మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన బుర్కె రవీందర్ (26) మృతి చెందాడు. బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అడవి జంతువులు అడ్డురావడంతో కిందపడి మృతిచెందాడు.



ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్, LXIII ఆఫ్ 1951 క్రింద ఇన్‌కార్పొరేట్ చేయబడింది)
మంచిర్యాల బ్రాంచ్

SFCs యాక్ట్ 1951లోని సెక్షన్ 29 క్రింద అమ్మకం కోసం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (APSFC) వారు SFCs యాక్ట్ 1951 లోని సెక్షన్ 29 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొని, డిఫాల్టుకు పాల్పడిన కారణంగా దిగువ తెలిపిన ఇండస్ట్రియల్ సంస్థలకు చెందిన తనఖా పెట్టిన / తాకట్టు పెట్టిన ఆస్తులపై రికవరీ చర్య ప్రారంభించారు.

APSFC వారు టెండరు కమ్ బిడ్ ప్రాతిపదికన బహిరంగ వేలం ద్వారా ''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'' మరియు ''అక్కడ ఏమున్నదో అదే'' ప్రాతిపదికన దిగువ తెలిపిన ఆస్తులను కొనుగోలు చేసేందుకు ప్రజల నుండి టెండర్లు కోరుతున్నారు.

క్ర. సం.	ఇండస్ట్రియల్ సంస్థ పేరు & లోకేషన్	కార్యకలాప రకం	అమ్మకానికి ఆఫర్ చేసిన ఆస్తులు	రిజర్వు ధర (రూ. లక్షలలో)	బయానా ఎ) మొత్తం ఆస్తులు బి) మెషినరీ మాత్రమే (రూ. లక్షల్లో)
1.	M/s. నందీశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ (సర్వే నం. 216/ఎ, 216/ఎఎ/2, ఎలగడప (గ్రా॥), కడెం (మం.), నిర్మల్ జిల్లా. ఏకైక ప్రొప్రైటర్, శ్రీ జంజిరాల రవీందర్, తండ్రి: గణపతి.	2 TPH రైస్ మిల్	ఎ) భూమి మరియు భవనం: ఎలగడప (గ్రా॥), కడెం (మం.), నిర్మల్ జిల్లా వద్ద గల సర్వే నం.లు 216/ఎ 216/ఎఎ/2 చే కవర్ చేయబడిన 464.68 చ.మీటర్లలో నిర్మించిన GI షీట్ రూఫ్‌తో కలిగిన ఎ.1-02 గుంటల విస్తీర్ణం గల యూనిట్ భూమి.	ఎ) 11.06	ఎ) 3.09
			బి) ప్లాంట్ & మెషినరీ: 2TPH కెపాసిటీ రైస్ మిల్ ప్లాంట్ & మెషినరీ	బి) 10.57	బి) 1.51

నియమ నిబంధనలు:
i) టెండరు ఫారాన్ని నగదు/డిడి ద్వారా రూ. 300/- చెల్లింపు చేసి క్రింది సంతకందారు నుండి/ ఏదైనా బ్రాంచ్ కార్యాలయం నుండి పొందవచ్చును.
ii) పూర్తి చేసిన సీల్డ్ టెండర్లను సంబంధిత బ్రాంచ్ మేనేజరుకు దాఖలు చేయవలెను.
iii) అవసరమైన EMD ని మంచిర్యాల బ్రాంచ్ వద్ద చెల్లింపబడేలా "APSFC" పేరున తీసిన DD / పే ఆర్డర్ ద్వారా చెల్లించాలి.
iv) ఈ అమ్మకం ప్రకటన ప్రకటన తేదీ నుండి 90 రోజుల వరకు చెల్లుబాటులో ఉంటుంది.
v) టెండర్లు 18-01-2024న లేదా ఆ తర్వాత తెరువబడి, ప్రాసెస్ చేయబడును. మరియు అది ప్రకటన తేదీ నుండి 90 రోజుల వరకు కొనసాగుతుంది.
vi) ప్రతి బుధవారం లేదా ఏదేని ఇతర తగిన రోజున బిడ్డింగ్ కోసం / సంప్రదింపులు జరిపేందుకు టెండర్లు పిలువబడును.
vii) ఒకరి కంటే ఎక్కువ మంది టెండరుదార్లు హాజరయినప్పుడు బిడ్డింగ్ నిర్వహించబడుతుంది. మరియు తదుపరి సంప్రదింపులు కొనసాగుతాయి. సహేతుకమైన (కమిటీ యొక్క అభిప్రాయసారం) మెరుగైన ఆఫర్లు కోరుతూ 7 రోజుల పాటు నోటీస్ బోర్డుపై ఉంచబడును.
viii) ఈ 7 రోజుల కాలంలో కొత్త టెండరుదార్లు అవసరమైన EMD తో టెండర్లను మరియు ప్రదర్శించబడిన ఆఫర్‌లో 15% అదనపు డిపాజిట్‌ను దాఖలు చేయవచ్చును. మెరుగైన ఆఫర్లు అందిన మీదట, ప్రస్తుత మరియు కొత్త టెండరుదార్ల మధ్య తదుపరి బిడ్డింగ్/సంప్రదింపులు నిర్వహించబడును మరియు తదుపరి ఆఫర్లు కార్పొరేషన్ గైడ్‌లైన్స్ ప్రకారం అనుమతించబడును.
ix) రిజర్వు ధర కంటే తక్కువకు కోట్ చేసిన బిడ్లు ఖచ్చితంగా తిరస్కరించబడును మరియు బయానా వాపసు చేయబడుతుంది.
x) టెండరు ఫారంకు జత చేసిన ఇతర నియమ నిబంధనలన్నింటికి కట్టుబడి ఉండాలి మరియు వాటిని పాటించాలి.
xi) ఎటువంటి కారణాలు తెలియజేయకుండా కార్పొరేషన్ వారు తమ అభిప్రాయసారం మేరకు టెండర్లను/బిడ్లను అంగీకరించు/తిరస్కరించు లేదా నియమ నిబంధనలను మార్పు చేయు మరియు రద్దు చేయు హక్కు కలిగి ఉన్నారు.
xii) అమ్మకానికి ఉంచిన ఆస్తులను తనిఖీ చేసుకోగోరు బిడ్డర్లు బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించవచ్చును.
xiii) ఆస్తులు ఏవైనా తాకట్టు రుణ భారాలు ఉంటే వాటితో సహా ''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే'' మరియు ''అక్కడ ఏముంటే అవే'' ప్రాతిపదికన విక్రయించబడును (కార్పొరేషన్ పరిజ్ఞానం మేరకు ఎటువంటి తాకట్టు రుణ భారాలు లేవు)
xiv) టెండరుదారు సీల్డ్ టెండరును దాఖలు చేసేటప్పుడు, టెండరు ఫారానికి జత చేసిన సాధారణ నియమ నిబంధనల పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉన్నారని/తెలుసని మరియు బద్ధులై ఉన్నారని భావించబడును. అయితే, ఏదేని తదుపరి స్పష్టీకరణలను కార్పొరేషన్‌కు చెందిన సంబంధిత అధికారుల నుండి టెండరు దాఖలు చేసే ముందు పొందవచ్చును.

ప్రదేశం: మంచిర్యాల
తేది: 18-12-2023
సం/-
బ్రాంచ్ మేనేజర్

శాఖ: ప్లాట్ నం.414, బ్లాక్ నం.4, జన్మభూమి నగర్, మంచిర్యాల, సెల్: 8498945680, ఫోన్: 08736-252567
ప్రధాన కార్యాలయం: 5-9-194, చిరాగ్ అలీ లేన్, పి.బి.నం.165, హైదరాబాద్ - 500001
ఫోన్: 9866512501, 040-23201646, 23202550, 23202551, ఫ్యాక్స్: (040)-23202972
ఇమెయిల్: tsfc-gen@tgsfc.in, URL: apsfc.com

గురుకులం పిలుస్తోంది..

- ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ
- ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- ఎస్సీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం



బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి (వీటీజీ సెట్ -24) రంగం సిద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈ ఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ ఇ.నవీన్ నికోలస్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలను ఆయా సంక్షేమ శాఖల ద్వారా గురుకులాలను నిర్వహిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన చేస్తూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సహజసిద్ధమైన నైపుణ్యాలను వెలికితీయడానికి గురుకుల విద్యాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. దీంతో ఆయా గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఏటా విద్యార్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటోంది. ప్రవేశపరీక్షలో మెరిట్ మార్కుల ప్రాతిపదికన ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి సీటు కేటాయిస్తారు. ప్రభుత్వ గురుకులాల్లో సీటు సాధించిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

జనవరి 6 వరకు గడువు..

ఐదో తరగతిలో ప్రవేశం కోసం 2024 ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఎంపిక చేసిన కేంద్రాలలో ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1గంటకు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 18న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 2024 జనవరి 6వ తేదీ వరకు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇందుకు రుసుము రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది.

దరఖాస్తు దారులకు సూచనలు :

- 2023-24 విద్యాసంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నట్లుగా సంబంధిత పాఠశాల నుంచి బోనఫైడ్ /స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఓ అభ్యర్థికి బదులు మరో అభ్యర్థి ఫొటో పెట్టి దరఖాస్తు చేయరాదు. ఆ తీరుగా వ్యవహరిస్తే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారు.
- విద్యార్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారు.
- ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 1800 42545678ను ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న గురుకులాల వివరాలు

జిల్లా	గురుకుల సొసైటీ	గురుకులాలు
మంచిర్యాల	టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్	09
మంచిర్యాల	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్	08
మంచిర్యాల	టీఆర్ఈఐఎస్	01
కొమురంభీమ్	టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్	10
కొమురంభీమ్	టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్	05
కొమురంభీమ్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్	05
ఆదిలాబాద్	టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్	03
ఆదిలాబాద్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్	06
ఆదిలాబాద్	టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్	13
నిర్మల్	మొత్తం గురుకులాలు	19

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ గురుకులాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని ప్రమాణాలతో బోధన చేసి విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ప్రత్యేకించి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆటలపై ఆసక్తి, ధ్యానం ఇతర అన్ని విధాల విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వ గురుకులాల్లో సీటు రావడం వరంగా విద్యార్థులు గుర్తించాలి.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సంక్షేమ గురుకుల విద్యాలయం, బెల్లంపల్లి

కోతిదేవుడి జాతరకు ముస్తాబు

- 19న రథోత్సవంతో జాతరకు అంకురార్పణ
- 20న నిండు జాతర
- తరలిరానున్న వేలాది భక్తులు



ధర్మారంలోని కోతిదేవుని ఆలయం

లక్ష్మణచాంద: ఒక కోతి మరణిస్తే దానికి గ్రామస్తులంతా ఒకే తాటిపైకి వచ్చి సమాధి నిర్మించారు. ఆ తరువాత మండలంలోని ధర్మారం -పీచర గ్రామాల మధ్యన ఆలయం నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. భక్తుల కోరికలు నెరవేరడంతో ఆలయానికి రద్దీ పెరిగింది. దీంతో ఏటా రెండు రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

కోతిదేవుడి ఆలయ చరిత్ర...

1976లో నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామంలోకి ఒక కోతి వచ్చింది. అది ప్రజలతో మధ్యన మమేకమై ప్రజలతో కలిసి మెలిసి ఉండేది. గ్రామంలోని రైతులకు ఆ కోతితో విడదీయని అవినాభావ సంబంధం ఏర్పడింది. ఆ విధంగా రెండు సంవత్సరాలు ఆ కోతి ప్రజలతోనే కలిసి జీవనం కొనసాగింది. ఆ తరువాత ఆ కోతి ప్రవర్తనలో మార్పు వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ప్రజల మీదకు వచ్చి వారిని కరుస్తూ వారి పంటలను నాశనం చేయడం ప్రారంభించింది. ఈ క్రమంలో ధర్మారం గ్రామస్తులు ఆ కోతిని ఊరి బయటకు తరిమి వేశారు. కానీ ఆ కోతి మళ్లీ గ్రామంలోకి రావడంతో భయపడిన గ్రామస్తులు దానిని చంపి ఊరి బయట సమాధి చేశారు.

గ్రామస్తుల కలలోకి వచ్చి...

కోతిని చంపివేయడంతో గ్రామంలో కొంతవెలితి కనిపించింది. ఓ వ్యక్తి కలలోకి వచ్చి తాను మారుతి రూపంలో వచ్చిన ఆంజనేయ స్వామిని అని చెప్పడంతో ఆ వ్యక్తి మరుసటి రోజు ఉదయం గ్రామంలోని పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశాడు. గ్రామస్తులందరూ కలిసి ఆ కోతికి ఒక సమాధిని నిర్మించి నిత్యం పూజలు చేయడం ప్రారంభించారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల వారు కూడా అక్కడికి వచ్చి పూజలు చేయడంతో ఒక్కసారిగా కోతిదేవుడి పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వ్యాపించింది.

ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో జాతర...

ప్రతీ సంవత్సరం డిసెంబరు 19, 20 తేదీలలో గ్రామస్తులు ఘనంగా జాతరను నిర్వహిస్తారు. ఈ జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర వంటి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యల వస్తారు. జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను సైతం ఏర్పాటు చేయనుంది. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

మహిమ గల కోతి దేవుడు



మండలంలోని ధర్మారం గ్రామంలోని కోతిదేవుడు చాలా మహిమ గల దేవుడని భక్తుల కోరిన కోర్కెలు తీర్చుదేవుడు. ఇక్కడకు వచ్చి కోతిదేవుడిని పూజించిన భక్తుల కోరికలు తప్పక నెరవేరుతాయని ఇక్కడి ప్రజల, భక్తులు నమ్మకం.

– సుమన్, ఆలయ కమిటీ సభ్యుడు

జాతరకు సర్వం సిద్ధం



ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే మహా కోతిదేవుడి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశాం. అక్కడికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. 19న రథోత్సవంతో జాతరకు అంకుర్పాణ చేస్తాం. 20వ తేదీన జాతరకు వచ్చే భక్తులందరికీ అన్నదానం ఉంటుంది.

– రాజేందర్‌రెడ్డి, సర్పంచ్, ధర్మారం

జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

కైలాస్‌నగర్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వారి కార్యాలయాల్లో వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కాగా అధికారులు ఎమ్మెల్యేను సైతం శాలువతో సత్కరించారు. ఆయన వెంట సీనియర్ జర్నలిస్టు సయ్యద్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. దహెగాం మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బుర్రి నానయ్య తనకు విద్యుత్ బోర్ బావి మంజూరు చేయాలని, ఉట్నూర్ గ్రామానికి చెందిన బాలేవు రాములు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఊర్వేత నవీన గురుకుల కళాశాలలో సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, బజార్‌హత్నూర్ మండలం రత్తన్నగూడ గ్రామానికి చెందిన కుంరం మాధవ్ అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీ ఎంహెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుర్దాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి, డీడీ దిలీప్‌లకు వినతిపత్రం అందించారు. గ్రామానికి రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, చైతన్య యూత్ అధ్యక్షుడు తొడసం విజయ్ కుమార్, ఆడెం శ్రీనివాస్, ఇస్తారి, కృష్ణ, పరశురాం ఉన్నారు.

ఏసీబీ వలలో లేబర్ ఆఫీసర్

- రూ.25వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- సహకరించిన కుమారుడు దామోదర్
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు



లేబర్ ఆఫీసర్ నివాసంలో ఏసీబీ అధికారులతో నిందితుడు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహాయక కార్మిక శాఖ అధికారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాల ప్రకారం.. కడెం మండలం పెద్ద బెల్లాలు గ్రామానికి చెందిన గంగన్న తల్లి రిజిస్టర్డ్ లేబర్, ఆమె చనిపోవడంతో తన తల్లికి అందాల్సిన పరిహారం రూ.లక్షా 30వేల కోసం వారం కిందట కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లాడు. దీంతో ఫైల్‌పై సంతకానికి సాయిబాబా రూ.30వేలు డిమాండ్ చేశాడు. చివరికి రూ.25వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోని కార్మికశాఖ అధికారి ఇంటి వద్ద తన కొడుకు దామోదర్‌కు రూ.25వేలు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు. తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లోని సెంట్రల్ జైలుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించాడు.



స్వాధీనం చేసుకున్న నగదు

హాకీ చాంపియన్ ఆదిలాబాద్



విజేతగా నిలిచిన హాకీ జట్టు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా హాకీ జట్టు 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిజామాబాద్ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో పెనాల్టీ స్ట్రోక్‌లో 4-0 గోల్స్‌తో విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్ నగర్ జట్టుపై 4-0 తో మట్టికరిపించి ఫైనల్ దూసుకెళ్లిన ఆదిలాబాద్ జట్టు నిజామాబాద్‌తో జరిగిన మ్యాచ్ 2-2 తో నిలవగా, పెనాల్టీ షూట్ అవుట్‌లో అజేయంగా నిలిచింది. జట్టు విజయంలో సాయిరాం, మోతిరామ్, ప్రమోద్, శంభు, కిరణ్, ప్రసాద్, వెంకటేష్‌లు కీలక పాత్ర పోషించారని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలవడంపై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, జిల్లా గిరిజన అధికారి పార్థసారథి, హాకీ సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పెటా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి అభినందించారు.

బస్సును అడ్డుకున్న గ్రామస్తులు



బస్సు ఆపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రకటిస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉచిత ప్రయాణానికి మహిళలు దూరం అవాల్సి వస్తోంది. భీంపూర్ మండలంలోని ఇందూర్‌పల్లి బస్‌స్టాప్ వద్ద మహిళలు ఉన్నారనే ఉద్దేశంతో బస్సు ఆపలేదని గ్రామస్తులు బస్సును సోమవారం రాత్రి అడ్డుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి కరంజి(టి)కి బయలుదేరిన బస్సు ఇందూర్‌పల్లి వద్ద బస్టాండ్‌లో ఆపకుండా వెళ్లింది. ఈ విషయం మహిళలు గ్రామస్తులకు తెలుపడంతో బస్సు మళ్లీ తిరిగి వచ్చే క్రమంలో అడ్డుకొని నిరసన తెలిపారు. డ్రైవర్, కండక్టర్‌ను క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం, పక్కన ఢీకొట్టిన జీపు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావల శివారు ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. మావల గ్రామానికి చెందిన ఎంబడి వంశీ తెల్లవారుజామున మణిపూర్‌లోని ఆయన ఫాంహౌజ్‌కు పాలు తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గ్రామ శివారు ప్రాంతంలో వెనుక వైపు నుంచి జీపు ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనకు కారకుడైన జీపు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. తన కుమారుడిని హత్య చేసేందుకే జీపుతో ఢీకొట్టారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నేడు జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట పాఠశాలలో ఉమ్మడి జిల్లా (జోనల్ స్థాయి) అండర్-17 బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రాలతో నాలుగు సెట్ల అర్హత పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని బాల, బాలికల క్రీడా జట్లు ఉదయం 10గంటలకు పోటీల కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి, జాబాడే రాష్ట్ర పాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

గుండెపోటుతో భీంపూర్ తహసీల్దార్ మృతి



నారాయణ(ఫైల్)

తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జె.నారాయణ(54) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయన ఆగస్టు 4న భీంపూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నాలుగు నెలలుగా ఆదిలాబాద్ నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో కుటుంబ సభ్యులను కలిసేందుకు నిర్మల్ వెళ్లాడు. రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. తహసీల్దార్ మృతిపై కలెక్టర్ తెలిపారు.

అనంతపేటలో విషాదఛాయలు

నిర్మల్‌రూరల్: తహసీల్దార్ నారాయణ స్వగ్రామమైన నిర్మల్‌రూరల్ మండలంలోని అనంతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. నారాయణకు కుమారుడు, ముగ్గురు కూతుళ్ల సంతానం. గతంలో నిర్మల్‌అర్బన్, నిర్మల్‌రూరల్, లక్ష్మణచాంద, బాసర తహసీల్దార్‌గా పనిచేశారు. నిర్మల్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసమున్నారు. సాధారణ ఎన్నికల సమయంలో భీంపూర్‌కు బదిలీ అయ్యారు. మంగళవారం అనంతపేటలో అంత్యక్రియలు జరగనున్నాయి.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

నేరడిగొండ: కడుపునొప్పితో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై మారుతి వివరాల ప్రకారం... మాకునూర్ అశ్విని(36) వాంకిడి గ్రామానికి చెందిన రమేష్ కుమార్‌తో 14ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. మూడు నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండగా ఆస్పత్రుల్లో చూపెట్టినా నయం కాలేదు. దీంతో మనస్థాపంతో ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పులారి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788966]

WANTED

డైరెక్ట్ హోటల్ జాబ్స్, ఫీజు లేదు, హైదరాబాద్‌లోని 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ కావలెను. జీ: 12-16 వేలు, రూమ్+ఫుడ్ ఫ్రీ. ఇది కన్సల్టెన్సీ కాదు. Age: 18-30, Ph: 9989978686 [H-788240]

శ్రీ సాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్ల లో ఇంటిపని, వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసుకొను టక ఫ్రీ/ఫు. కావలెను. జీతం : 18000/- ఏజెంట్ కమీషన్ 7K ఫోన్ : 9666001826, 9666001827 [H-793448]

www.sakshi.com

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9849933042. [M-1221945]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,